## మాట వినకుంటే ప్రభుత్వాన్ని మారుస్తాం!

(మొదటి తరువాయి)



విద్యార్థుల రక్తం చిన్దింది. అది చాలా చెడ్డది. అది చాల్లేదా? ఇప్పటికీ విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారు. అనేక రాష్ట్రాల్లో పోలీసులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అరెస్టుల బెదిరింపులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విద్యార్థులు ఉగ్రవాదులు కాదు. వారు మన దేశ భవిష్యత్తు. దేశ భవిష్యత్తును ఇలా ఇబ్బంది పెడితే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే రేపు ప్రభుత్వం సరిగా ప్రవర్తించకపోతే మేము వెళ్లి ప్రభుత్వాన్ని మారుస్తాము అని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జరిగిన దేశవ్యాప్త నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఇప్పటికీ పోలీసు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం హామీలను పాటించాలని, విద్యార్థులను లక్ష్యంగా చేసుకోవడం ఆపాలని ఆయన కోరారు.

మోడీ సర్కార్‌ను చుట్టుముడతాం

రైతు నాయకుడు రాకేష్ తికాయత్‌తో సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా మంగళవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీజేపీ నాయకులు, భారతీయ కిసాన్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. రైతులు విద్యార్థులు యువతను ఒకే వేదికపై ఐక్యం చేయడమే ఈ సమావేశ ప్రధాన అంశం అని సీజేపీ తెలిపింది.

సమావేశం తర్వాత రంకా మాట్లాడుతూ మా రైతు సోదరులు, ఈ దేశ విద్యార్థులు, యువత కలిసి మోడీ ప్రభుత్వాన్ని అన్ని వైపుల నుంచి చుట్టుముట్టేలా పని చేస్తారని ఆశిస్తున్నామని అన్నారు. ఈ సమావేశం సీజేపీ తన 36 రోజుల నిరసనను నిలిపివేసిన కొన్ని రోజుల తర్వాత జరిగింది. సీజేపీ ఇప్పుడు రైతులతో కలిసి విస్తృత కూటమి ఏర్పాటు చేసుకోవాలని చూస్తోందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

## ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే మూలస్తంభం

(మొదటి తరువాయి)

విక్రమార్క మీడియాతో మాట్లాడారు సమావేశంలో ప్రధానంగా మూడు అంశాలపై విస్తృత చర్చ జరిగిందని, పార్టీ-ప్రభుత్వ సమన్వయంపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్ఆర్ఆర్) ప్రక్రియపై తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అత్యంత సమర్థవంతంగా పనిచేస్తున్నారని, వారి పనితీరును ఏఐసీసీ సైతం సమీక్షించి అభినందించిందని చెప్పారు. మిగిలిన ఓటరు నమోదు ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలని ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారన్నారు.మరొకవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ క్యాడర్, సంస్థాగత వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ చేర్చేందుకు సమావేశంలో ఒక ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు ఆయన వివరించారు. రాబోయే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల గురించి సమన్వయ కమిటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. ముందుగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదును వేగవంతం చేయడంతో పాటు, ఎమ్మెల్సీ బరిలో నిలిచే ఆశావాహుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా చూడాలని నిర్ణయించామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆయా జిల్లాల ఇన్చార్జి మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. మంత్రులు తమ జిల్లాల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు (డీసీసీ), ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులతో విస్తృతంగా చర్చించి.. ముగ్గురు సభ్యులతో కూడిన ప్యానెల్ను పార్టీ అధిష్టానానికి సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మొత్తంగా ఓటరు నమోదు, ప్రభుత్వ పథకాల ప్రచారం, ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై భేటీలో స్పష్టమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకుని, వాటి అమలుకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు భట్టి విక్రమార్క మీడియాకు వివరించారు.

## తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర




మిగిలిన 2 వేల పోస్టుల భర్తీకి సంబంధించిన ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. గతంలో 2015, 2018, 2022లలో భారీగా నియామకాలు జరగగా.. తాజా ప్రకటనతో నిరుద్యోగుల ఆందోళనలకు తెరపడింది. శాంతిభద్రతల బలోపేతమే లక్ష్యంగా ఈ నియామకాలు వేగవంతం కానున్నాయని ఉన్నతాధికారులు వెల్లడించారు. త్వరలోనే 5 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో నిరుద్యోగ సమస్యను తీర్చేందుకు తమ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతోందని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ఏకంగా 67760 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన వారు.. పాలకులుగా వచ్చారని.. కానీ తాను మాత్రం ఒక పాలకుడిగానే కాకుండా.. సేవకుడిగా, సామాన్య ప్రజల ప్రతినిధిగా వచ్చినట్లు రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నానని గుర్తు చేశారు. అందుకే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. “ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే ముందు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి, అన్ని వర్గాల ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నాను. యువత, విద్యార్థులు ఎక్కువగా ప్రస్తావించిన సమస్యల్లో నిరుద్యోగం, పరీక్షల్లో అవకతవకలు, ముఖ్యంగా గ్రూప్-2 ప్రశ్నాపత్రం లీకేజీ వంటి ఘటనలు ప్రధానమైనవి. నియామక ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయత పెంచేందుకు రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కీలక బాధ్యతల్లో నియమించాం. పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన నిబంధనలు, పటిష్ట పర్యవేక్షణ వ్యవస్థలు, సమగ్ర సంస్కరణలు అమలు చేశాం” అని గుర్తు చేశారు.

## కర్ణాటకలో 7 వేల మంది విద్యార్థులకు హెచ్ఐవీ

(మొదటి తరువాయి)




స్పష్టం చేశారు. దేశంలో అత్యధిక హెచ్ఐవీ బాధితులున్న రాష్ట్రాల్లో కర్ణాటక మూడో స్థానంలో ఉంది. తాజా నివేదికల ప్రకారం రాష్ట్రంలో 18 నుంచి 25 ఏండ్ల మధ్య వయసు కలిగిన ఏడు వేలకు పైగా విద్యార్థులు హెచ్ఐవీ బారిన పడ్డారు.

## అమిత్ షాను పదవి నుంచి తొలగించాల్సిందే..

(మొదటి తరువాయి)

విద్యార్థులపై పోలీసులు, భద్రతా బలగాల దాడికి ఆదేశాలిచ్చింది హోం మంత్రి అమిత్ షానే. ఒకవేళ ఈ విషయం అమిత్ షాకు తెలియకుంటే.. ఆయన ఈ పదవిలో కొనసాగడానికి అనర్హుడు. ఒకవేళ ఈ దాడికి అమిత్ షా ఆదేశించి ఉంటే ప్రధాన నిందితుడు కూడా ఆయనే. విద్యార్థులపై జరిగిన ఈ దారుణ ఘటనలకు బాధ్యుడైన అమిత్ షాను మంత్రివర్గం నుంచి తప్పించాలి. ఈ విషయంలో ప్రధాని మోదీకి కూడా నేను సలహా ఇస్తున్నా” అంటూ రాహుల్ చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రభుత్వం తనను మాట్లాడనివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. “నేను మాట్లాడేందుకు వీలుగా ఆర్డర్ ఇవ్వాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. కానీ, అనుమతి ఇవ్వలేదు. అమిత్ షాపై ఆరోపణలు చేసినందుకు నన్ను అనుమతించడం లేదని, క్షమాపణలు చెప్పాలి అంటున్నారు. క్షమాపణలు చెబితేనే అనుమతిస్తాం అంటున్నారు. నేను బీజేపీకి కానీ, ఆర్ఎస్ఎస్‌కు కానీ, ఏ ఒక్క వ్యక్తికి కానీ క్షమాపణ చెప్పబోను” అంటూ రాహుల్ వ్యాఖ్యానించారు. సీజేపీ నిరసనల సందర్భంగా మైనర్లపై కూడా పోలీసులు దాడి చేశారని రాహుల్ ఆరోపించారు. విద్యార్థులపై అదనపు బలగాల్ని ఉపయోగించడం తీవ్రమైన చర్యగా అభివర్ణించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**-దశలవారీగా ప్రతి కుటుంబానికి మంజూరు**
**-రూ.21వేల కోట్లతో రైతన్నపై రుణభారం తగ్గించాం**
**-కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం**
**-ఖమ్మం రూరల్ మండలంలో రూ.7.21 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన**



ఖమ్మం రూరల్

ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటనూ తూచా తప్పకుండా అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన తమ ప్రభుత్వం.. సంక్షేమం, అభివృద్ధిని రెండు కండ్లుగా భావిస్తూ ముందుకు సాగుతోందన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండల పరిధిలో రూ.7.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. డాక్యా తండాలో రూ.1.41 కోట్లతో మంగళగూడెం--డాక్యా తండా రోడ్డు, పల్లెగూడెంలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం నుంచి ఎన్ఎస్‌పీ మీదుగా పల్లెగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున కేవలం 9 రోజుల్లోనే రూ.9,200 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రూ.2 లక్షల వరకు ఉన్న రుణమాఫీ ద్వారా 25 లక్షల మంది రైతులకు రూ.21,000 కోట్ల మేర ఆర్థిక భారం తగ్గించామని తెలిపారు. సన్న వరిధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. నాలుగు విడతల్లో నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యమని స్పష్టం చేశారు. తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో రూ.2.50 లక్షలతో కలిపి ఇప్పటివరకు మొత్తం రూ.7 లక్షల ఇండ్లను మంజూరు చేసినట్టు వెల్లడించారు. రెండో విడతలో మిగిలిన గ్రామాలకు త్వరలోనే ఇండ్లు మంజూరు చేస్తామని, రాబోయే మూడో, నాలుగోవ విడతల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామని అన్నారు. గ్రామీణ రహదారులు, విద్యాసంస్థలు, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఆగిపోకుండా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఈఈ మహేష్‌బాబు, పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## దూకుడుగా వాయుగుండం

(మొదటి తరువాయి)

తీవ్ర భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ, ఈశాన్య తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు హనుమకొండ, భూపాలపల్లి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జనిగాం, కామారెడ్డి, ఖమ్మం, కుమురం భీమ్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీఅయింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమైన వాతావరణంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గురువారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పరిస్థితులు అత్యంత తీవ్రంగా మారనున్నాయని, కొన్ని ప్రాంతాల్లో గరిష్టంగా 300 మిమీ నుంచి 450 మిమీ వరకు వర్షపాతం నమోదుయ్యే అవకాశం ఉందని, దీనివల్ల భారీగా వరదలు ముంచెత్తుతాయని వాతావరణ నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పలు జిల్లాల్లో కుండపోత వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో బుధవారం భారీ నుండి అత్యంత భారీ వర్షాలు కురిసాయి. ములుగు జిల్లా వాజేడు మండలంలోని టేకులపల్లి, పేరూరు గూడేల వద్దనున్న ఇసుకవాగుపై నిర్మించిన డైవర్షన్ రోడ్డు ప్రవాహానికి వర్షపు నీటికి కొట్టుకుపోవడంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ 168ఎ జాతీయ రహదారిపై వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలపాతం ఉగ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ అధికారులు ముందుస్తు చర్యలు చేపట్టారు. భోగత జలపాతం సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.నిర్మల్ జిల్లా లక్ష్మణ చందా మండలంలోని ధర్మారం గ్రామం మీదుగా సోన్ వెళ్లే రహదారి వంతెన భారీ వరదలో తెగిపోయింది. ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందుస్తు జాగ్రత్తలు చెప్పారు. వంతెన మార్గాన్ని తాత్కాలికంగా మూసివేసి వాహనాల రాకపోకలు నిలిపివేశామని పోలీసులు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచిర్యాల పట్టణంలోని మాందోరి వెంకటేశ్వర మిషన్ పాఠశాల వద్ద నివాసముంటున్న అయ్యప్ప కనకలక్ష్మి ఇల్లు కూలిపోవడంతో ఆస్తి నష్టం సంభవించింది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం చెల్పూర్ వద్ద వాగు, కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌లోని నర్సింగరావుపల్లి నల్లవాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. సిద్దిపేట జిల్లా తొగుటలో వర్షపాతం నమోదుగాయింది. భారీ వర్షానికి కామారెడ్డి జిల్లా తీర్మాపూర్ విద్యుత్ ఉప కేంద్రంలోకి వరద నీరు చేరింది.

## ట్రంప్ చేతికి సుంకాల కొరడా

(మొదటి తరువాయి)

తేడాతో ఆమోదం లభించింది. దాదాపు రిపబ్లికన్లందరూ, మెజారిటీ డెమొక్రాట్లు ఏకమై 60 ఓట్ల అడ్డంకి నుండి బిల్లును గట్టెక్కించారు. ఈ నెలలో ఆకస్మికంగా మరణించిన గ్రాహమ్‌కు స్మారక సభ నిర్వహించిన కొన్ని గంటల తరువాత, రష్యా దురాక్రమణను గట్టిగా విమర్శించిన రిపబ్లికన్ సెనేటర్‌ను గౌరవించేందుకు క్యాపిటల్ హిల్‌కు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ సెనేటర్లు కలిసిన కొద్దిసేపటికే ఈ బిల్లు ఆమోదం పొందింది.

బిల్లు గురించి

ఈ బిల్లు రష్యా అధికారులు, కుబేరులు, ఆర్థిక సంస్థలు, మాస్కో ఎగుమతులపై ఆంక్షలను తప్పించుకోవడానికి ఉపయోగించే ‘షాడో ఫ్లీట్’ అని పిలువబడే దానిపై ఆంక్షలు విధిస్తుంది. రష్యా చమురు, గ్యాస్‌ను ప్రధానంగా కొనుగోలు చేసే దేశాలైన చైనా, భారతదేశం నుండి వచ్చే వస్తువులపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని కూడా ఇది ట్రంప్‌కు ఇస్తుంది. అయితే, తమ సహజవాయువులో 15 శాతం కంటే తక్కువ రష్యా నుండి దిగుమతి చేసుకుంటూ, ఆ దిగుమతులను తగ్గించుకోవడానికి చర్యలు తీసుకుంటున్న దేశాలకు మినహాయింపులు ఇస్తుంది. సవరించిన ఈ బిల్లు ట్రంప్ అభ్యర్థన మేరకు ఇరాన్ ఇంధన, ఆయుధరంగాలకు నిధులను పరిమితం చేయడానికి ఉద్దేశించిన ప్రస్తుత ఆంక్షల అధికారాన్ని కూడా పొడిగిస్తుంది. ఈ చట్టానికి గ్రాహం పేరు పెట్టారు. ఆయన దీనికి మద్దతు కూడగట్టడానికి ఏడాదికి పైగా కృషి చేసి, ఈ నెల మొదట్లో ఆకస్మికంగా మరణించడానికి కొద్ది కాలం ముందు, దీని సవరించిన రూపంపై వైట్ హౌస్‌తో ఒక ఒప్పందానికి వచ్చారు. ఈ బిల్లు మద్దతుదారులు, మాస్కో ఇంధన ఆదాయాన్ని అడ్డుకోవడానికి ఇది అవసరమని, తద్వారా ప్రస్తుతం ఐదవ సంవత్సరంలో ఉన్న ఉక్రెయిన్ యుద్ధానికి నిధులు సమకూర్చే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సామర్థ్యాన్ని బలహీనపరుస్తుందని వాదిస్తున్నారు. ఈ ఉభయపక్ష ఒప్పందంతో ముందుకు సాగడం కంటే సెనేటర్ గ్రాహం వారసత్వాన్ని గౌరవించడానికి ఇంతకంటే గొప్ప మార్గం లేదని ఆరుగురు రిపబ్లికన్, డెమోక్రటిక్ సెనేటర్లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రష్యాను శిక్షించడానికి విస్తృత మద్దతు ఉన్నప్పటికీ, ఈ సుంకాల నిబంధనలు ట్రంప్‌కు మితిమీరిన అధికారాన్ని కట్టబెడతాయని, అమెరికన్ వినియోగదారులకు దిగుమతి ఖర్చులను పెంచవచ్చని, లేదా యూరోపియన్ మిత్ర దేశాలను దెబ్బతీయవచ్చని కొంత మంది డెమోక్రాట్లు ఆందోళన వ్యక్తం చేశారు.

# ఫ్యూయల్ స్విచ్‌లో ఎలాంటి లోపమూ లేదు

**ఎయిరిండియా విమాన ప్రమాదంపై తుది దశలో దర్యాప్తు : కేంద్రం**



**న్యూఢిల్లీ –జూలై 29 జర్నలిస్ట్ డైరీ,**
గత సంవత్సరం 260 మంది ప్రాణాలు కోల్పోయిన ఎయిరిండియా విమాన దుర్ఘటనకు సంబంధించి దర్యాప్తు తుది దశకు వచ్చినట్టు కేంద్రం తెలిపింది. ప్రమాదానికి గురైన విమానంలో ఇంధన నియంత్రణ స్విచ్ లాకింగ్ మెకానిజంలో ఎటువంటి లోపమూ దర్యాప్తు అధికారులు గుర్తించలేదని బుధవారం పార్లమెంట్‌లో వెల్లడించింది. రాజ్యసభలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర సహాయమంత్రి మురళీధర్ మోహోల్ సమాధానమిస్తూ, ఒరిజనల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్ నిర్వహించిన అధునాతన పరీక్షల అనంతరం ఈ విషయం వెలుగులోకి వచ్చిందని ప్రభుత్వం పేర్కొన్నది. విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) తుది నివేదిక ఆలస్యం కాలేదని, ఎయిరిండియా దుర్ఘటనపై దర్యాప్తు ఇప్పుడు తుది దశలో ఉందని తెలిపింది.

# రెండేండ్లు ఆలస్యమైతే కోర్టు అనుమతి తప్పనిసరి!



**న్యూఢిల్లీ –జూలై 29 జర్నలిస్ట్ డైరీ,**
జనన, మరణ నమోదు (సవరణ) బిల్లును బుధవారం కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. జనన, మరణాల నమోదు రెండేండ్లు ఆలస్యమైతే కోర్టు అనుమతి తప్పనిసరి చేసింది. సంఘటన జరిగిన రెండేండ్ల తర్వాత నమోదయ్యే జనన, మరణాల నమోదుకు ముందు న్యాయపరమైన పరిశీలన, ఆమోదం అవసరమయ్యేలా సవరణలు చేస్తూ ఈ బిల్లును ప్రవేశపెట్టారు.

# తమిళనాడులో మధ్యాహ్నం భోజనంలో బిర్యానీ




**చెన్నై ,–జూలై 29 జర్నలిస్ట్ డైరీ,**
తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు వారానికి ఒకసారి చికెన్ బిర్యానీ అందించే ఆలోచనలో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఉంది. పాఠశాలల్లో పౌష్టికాహారాన్ని మెరుగపరచడంతో పాటు, విద్యార్థులను పాఠశాలలవైపు మరింతగా ఆకర్షించేందుకు చేసిన ఈ ప్రతిపాదనను సీఎం విజయ్ పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.


# మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ చిట్



**న్యూఢిల్లీ –జూలై 29 జర్నలిస్ట్ డైరీ,**
బొగ్గు బ్లాకుల కేటాయింపు కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ఉన్న క్రిమినల్ విచారణను ఆయన మరణించిన రెండేండ్ల తర్వాత సుప్రీంకోర్టు బుధవారం మూసివేసింది. దర్యాప్తు సంస్థ ముగింపు నివేదికలను తిరస్కరించి విచారణకు హాజరు కావాలని ఆయనకు సమన్లు జారీచేసిన 2015 నాటి ప్రత్యేక సీబీఐ కోర్టు ఉత్తర్వును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మన్మోహన్ సింగ్ అప్పీల్‌ను అనుమతిస్తూ సీబీఐ నిర్ధారణలను తిరస్కరించడానికి లేదా ఆయనకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడానికి బలమైన కారణాలు ఏవీ లేవని కోర్టు పేర్కొంది. ఈ కేసు యూపీఏ ప్రభుత్వ హయాంలో తలబీర-2 బొగ్గు బ్లాక్ కేటాయింపునకు సంబంధించినది.


# ఆగస్టు 12న సంపూర్ణ సూర్యగ్రహణం..

**భారత్‌లో కనిపించదట.. లఎందుకంటే..!**



**న్యూఢిల్లీ –జూలై 29 జర్నలిస్ట్ డైరీ,**
2026 ఆగస్టు 12న సంపూర్ణ సూర్యగ్రహణం సంభవించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఖగోళ శాస్త్రవేత్తలు, ఔత్సాహికులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ అరుదైన దృశ్యం భారతదేశం లో మాత్రం కనిపించదు. మన దేశంలో ఆ సమయానికి రాత్రి అవుతుండటమే ఇందుకు ప్రధాన కారణమట. సూర్యుడి కి, భూమి కి మధ్య చంద్రుడు అడ్డుగా వచ్చినప్పుడు సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడుతుంది. చంద్రబింబం సూర్యుడిని పూర్తిగా కప్పివేయడంతో పగటిపూట కూడా ఆకాశం చీకటిగా మారి, ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోతాయి. ఆ సమయంలో నక్షత్రాలు, గ్రహాలు కూడా స్పష్టంగా కనిపించే అవకాశం ఉంటుంది. నాసా శాస్త్రవేత్తల కథనం ప్రకారం.. సూర్యుడు చంద్రుడి కంటే 400 రెట్లు పెద్దదైనప్పటికీ, అదే స్థాయిలో దూరంగా ఉండటంవల్ల ఆకాశంలో చంద్రుడు, సూర్యుడు దాదాపు ఒకే పరిమాణంలో కనిపిస్తాయి. ఈ సంపూర్ణ గ్రహణం గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్, స్పెయిన్, పోర్చుగల్‌లోని కొన్ని ప్రాంతాలతోపాటు ఉత్తర రష్యా, అట్లాంటిక్ మహాసముద్రం పరిధిలో కనిపిస్తుంది. ఇక ఉత్తర అమెరికా, కెనడా, యూరప్, వాయువ్య ఆఫ్రికాలోని పలు ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణాన్ని వీక్షించే అవకాశం ఉంది. భారత కాలమానం ప్రకారం.. ఆగస్టు 12 రాత్రి 9:45 గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రహణం ఆగస్టు 13 తెల్లవారుజామున 2:15 గంటల వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో మన దేశంలో సూర్యరశ్మి ఉండదు కాబట్టి గ్రహణాన్ని వీక్షించే వీలు లేదు. అందువల్ల గ్రహణం సమయంలో పాటించే సూతక్ కాలం వంటి సాంప్రదాయ నియమాలు మనకు వర్తించవని పండితులు స్పష్టం చెబుతున్నారు. అయితే ఈ ఖగోళ అద్భుతాన్ని వీక్షించాలనుకునే భారతీయులు నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ వంటి సంస్థల అధికారిక వెబ్‌సైట్లు, యూట్యూబ్ ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూడవచ్చు.


# అర్జంట్ కేసుల్లో ప్రత్యక్ష ప్రసారంలో ఆడియోను మ్యూట్ చేయాలి



**న్యూఢిల్లీ –జూలై 29 జర్నలిస్ట్ డైరీ,**
సుప్రీంకోర్టు కేసుల విచారణలను ప్రత్యక్ష ప్రసారం చూసేవారికి అత్యవసర కేసుల విషయంలో చెప్పే కొన్ని మాటలు ఇక వినిపించవు. ఎందుకంటే ఆ సమయంలో కొన్ని మాటలను మ్యూట్ చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో అత్యవసర కేసుల విచారణకు సంబంధించి చీఫ్ జస్టిస్ ముందు లాయర్లు చేసే అభ్యర్థనలు, కోర్టు ఇచ్చే సమాధానాలు ప్రత్యక్ష ప్రసారంలో వినపడకుండా చేస్తారు. బుధవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ముందు కొత్త విషయాలను ప్రస్తావిస్తున్నంతసేపు లైవ్‌లో ఆడియోను నిలిపివేశారు. ఉదయం కోర్టు చేసే పనుల్లో 'మెన్షనింగ్ అనేది ఒక భాగం. దీనిలో లాయర్లు సీజేఐని కేసులను అత్యవసరంగా విచారణ చేయాలని కోరతారు. కేసును బట్టి అత్యవసరమా కాదా అని విషయం సీజేఐ తీసుకునే నిర్ణయాన్ని బట్టి ఉంటుంది. ఈ సమయంలో విచారణ తేదీని ఖరారు చేసేటప్పుడు లేదా తిరస్కరించేటప్పుడు మౌఖికంగా వ్యాఖ్యలు చేస్తారు. ఇలాంటి వ్యాఖ్య ఇటీవల చర్చనీయాంశంగా మారింది. దీంతో సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల ఢిల్లీలో నిరసన చేపడుతున్న విద్యార్థులు, నిరసకారులపై ఢిల్లీ పోలీసులు తీసుకున్న చర్యను సుమోటోగా తీసుకుని, అత్యవసర విచారణ చేపట్టాలని ఓ న్యాయవాది పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను వ్యతిరేకించే సమయంలో మా సమయం వృథా చేయకండి, మేము ఎలాంటి వీడియోలు చూడాలనుకోవడం లేదు అని సీజేఐ చేసిన వ్యాఖ్యలు వివాదమయ్యాయి. దీంతో అత్యవసర విషయాలను ప్రస్తావించడమనేది ఒక పరిపాలనా చర్య. అది న్యాయపరమైన ప్రక్రియ కాదు. దీన్ని ప్రచురించడం కాని వ్యాప్తి చేయడం కాని చేయకూడదు అని సీజేఐ పేర్కొన్నారు.

# రష్యా మోస్ట్ వాంటెడ్ జాబితాలో టెలిగ్రామ్ ఫౌండర్ పావెల్ దురోవ్..


**- తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నారంటూ ఆరోపణలు**



**న్యూఢిల్లీ –జూలై 29 జర్నలిస్ట్ డైరీ,**
టెలిగ్రామ్ ఫౌండర్ పావెల్ దురోవ్‌ను రష్యా మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. తీవ్రవాదాన్ని ప్రోత్సహించే చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై రష్యా అతడిని ఇంటర్నేషనల్ మోస్ట్ వాంటెడ్ లిస్ట్‌లో చేర్చింది. రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్‌బీఎస్) ఈ ప్రకటన చేసింది. ఉగ్రవాదాన్ని, అతివాదాన్ని ప్రోత్సహించే కంటెంట్‌ను కట్టడి చేయడంలో టెలిగ్రామ్ విఫలమైందని రష్యా ఆరోపించింది. పలు టెలిగ్రామ్ ఛానెళ్లు, చాట్‌లను రష్యా వ్యతిరేక చర్యలకు ఉపయోగిస్తున్నప్పటికీ.. వాటిపై టెలిగ్రామ్ తగిన చర్యలు తీసుకోలేదని రష్యా విమర్శించిందిఇదే సమయంలో కొన్ని టెలిగ్రామ్ ఛానెళ్లను ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తోందని కూడా రష్యా ఆరోపించింది. టెలిగ్రామ్‌ను వాడుకుని కొందరు రష్యన్లు ఉక్రెయిన్ రహస్యంగా నియమించుకుంటోందని, దీనివల్ల అక్కడి ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని రష్యా అంటోంది. ఈ యాప్ ద్వారా రష్యా వ్యతిరేక ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే టెలిగ్రామ్ సంస్థపై ఆరోపణలు చేస్తూ, ఆ సంస్థ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్‌ను మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. ఇటీవల టెలిగ్రామ్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫాంల వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు నియంత్రణకు రష్యా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందులోనూ ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇంటర్నెట్ వినియోగంపై ఆంక్షలు విధించింది. ప్రభుత్వ వ్యతిరేక కంటెంట్‌ను తీవ్రంగా పరిగణిస్తోంది. ఇప్పటికే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి వాటిని తన నియంత్రణలోకి తెచ్చుకుని పలు ఆంక్షలు విధించింది. అయితే, టెలిగ్రామ్‌ను మాత్రం కట్టడి చేయలేకపోయింది. అందుకే రష్యా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మ్యాక్స్ అనే దేశీయ మెసేజింగ్ యాప్ వినియోగాన్ని కూడా రష్యా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. విదేశీ యాప్‌ల వాడకాన్ని తగ్గించాలని పౌరులకు సూచిస్తోంది. ఇక టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్.. రష్యాలోనే జన్మించాడు. ఆ తర్వాత అతడు విదేశాలకు వెళ్లిపోయాడు. గత ఫిబ్రవరిలోనే రష్యా తనపై మోపిన అభియోగాలపై పావెల్ స్పందించారు. వ్యక్తిగత సమాచార గోప్యత, భావ ప్రకటనా స్వేచ్ఛను అణిచివేసేందుకు రష్యా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అందువల్లే తనపై తప్పుడు కేసులు పెడుతోందని పావెల్ విమర్శించారు.

# విషపూరిత కాలుష్యంలో రాజధాని బడులు

**-బీజేపీ పాలనలో పిల్లల ఆరోగ్యానికీ రక్షణ కరువు**
**-ప్రపంచ రాజధానుల్లో అత్యంత ప్రమాదకర నగరంగా న్యూఢిల్లీ**
**-90 శాతానికి పైగా ప్రయివేటు పాఠశాలలదీ అదే పరిస్థితి**
**-పర్యావరణ నియంత్రణలో మోడీ సర్కారు విఫలం**
**-అంతర్జాతీయ అధ్యయనంలో వెల్లడి**



**న్యూఢిల్లీ –జూలై 29 జర్నలిస్ట్ డైరీ,**
మోడీ పాలనలో భారత్‌లో కాలుష్య వాతావరణ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. 'స్వచ్ఛ భారత్', 'అభివృద్ధి చెందిన భారత్' అంటూ ప్రచారం చేసుకుంటున్న బీజేపీ పాలనలో దేశ రాజధాని న్యూఢిల్లీ విషపూరిత కాలుష్యానికి కేంద్రంగా మారింది. ఈ ఆందోళనకర వాస్తవాన్ని తాజా అంతర్జాతీయ అధ్యయనం ఒకటి వెలుగులోకి తెచ్చింది. అటు కేంద్రంలో, ఇటు ఢిల్లీలో బీజేపీ 'డబుల్ ఇంజిన్ సర్కారు' పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే దేశ రాజధానిలోని 90 శాతానికి పైగా ప్రయివేటు పాఠశాలలు లెడ్ (సీసం), పాదరసం (మెర్క్యూరీ), కాడ్మియం, ఆర్సెనిక్, పురుగు మందులు (పెస్టిసైడ్స్) వంటి ప్రమాదకర విషపదార్థాలతో కలుషితమైన ప్రాంతాలకు ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాల రాజధానులతో పోలిస్తే న్యూఢిల్లీ అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉంది. దీంతో ఇక్కడి పిల్లల ఆరోగ్యం, మేధో వికాసంపై దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశముందని నివేదిక హెచ్చరించింది. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు పర్యావరణ నియంత్రణలో విఫలమయ్యాయ ని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ?లండన్‌లోని సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ (సీజీడీ)కి చెందిన పరిశోధకుడు లీ క్రాఫర్డ్ రూపొందించిన "స్కూల్స్ ఇన్ ద షాడో ఆఫ్ టాక్సిక్ సైట్స్ : పొల్యూషన్ ప్రాక్సిమిటీ ఇన్ లో–అండ్ మిడిల్–ఇన్‌కమ్ కంట్రీస్" అనే నివేదికలో భారత్‌తో పాటు 17 తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లోని 2,840 పాఠశాలల పరిస్థితిని విశ్లేషించారు. మొత్తం 26 లక్షల పాఠశాలలను 11,301 నమోదైన విషపూరిత కాలుష్య కేంద్రాలతో పోల్చి పరిశీలించారు.

**న్యూఢిల్లీలో 90 శాతానికి ?పైగా స్కూళ్లు డేంజర్ జోన్‌లోనే!**

ఈ అధ్యయనం ప్రకారం.. పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలే గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే ఎక్కువ కాలుష్య ప్రమాదంలో ఉన్నాయి. ఈ దేశాల్లోని పాఠశాలల్లో దాదాపు 10 శాతం విషపూరిత కాలుష్య కేంద్రాలకు ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ ముప్పు మరింత తీవ్రంగా ఉంది. ప్రపంచంలోని రాజధానులన్నింటిలోనూ న్యూఢిల్లీ అత్యంత ప్రమాదకర నగరంగా ఉంది. ఇక్కడి 91.2 శాతం ప్రయివేటు పాఠశాలలు విషపూరిత కాలుష్య ప్రాంతాలకు సమీపంలో ఉన్నాయి. న్యూఢిల్లీ తర్వాతి స్థానంలో మనీలా (86 శాతం), నైరోబీ (71 శాతం), అక్రా (67 శాతం), జకార్తా (51 శాతం) వంటి నగరాలు ఉన్నాయి. కాగా భారీ జనాభా కలిగి ఉన్నటువంటి మెక్సికో సిటీలో మాత్రం ఇందుకు విరుద్ధమైన పరిస్థితులు కనిపించాయి. ఇక్కడ పారిశ్రామిక ప్రాంతాలను నగరానికి దూరంగా ఏర్పాటు చేయడంతో ఇలాంటి కాలుష్య ముప్పు దాదాపు కనిపించలేదని నివేదిక పేర్కొంది.

**పిల్లలపై లెడ్ ప్రభావం తీవ్రం**

సీసం (లెడ్) మానవ శరీరానికి అత్యంత ప్రమాదకరమైన లోహాల్లో ఒకటి. అది ఎంత తక్కువ పరిమాణంలో శరీరంలోకి ప్రవేశించినా సురక్షితం కాదని నిపుణులు చెప్తున్నారు. శరీరంలోకి వెళ్లిన తర్వాత అది ఎముకల్లో కాల్షియంలా నిల్వ ఉండి, రక్తంలో కలిసినప్పుడు గుండె, మూత్రపిండాల పనితీరును దెబ్బతీస్తుంది. కొన్నిసార్లు ఎలాంటి స్పష్టమైన లక్షణాలూ కనిపించకుండానే రక్తపోటు పెరగడం, గుండెపోటు వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది. దీంతో పిల్లల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటుంది. లెడ్ మెదడులోని మైలిన్ పొరను దెబ్బతీసి నాడీకణాల మధ్య అనుసంధానాన్ని బలహీనపరుస్తుంది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# చట్టమే 'హైడ్రా' కు మార్గదర్శి



చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములను కాపాడడం ఏ ప్రభుత్వానికైనా అత్యంత కీలకమైన బాధ్యత. ముఖ్యంగా వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ వంటి మహానగరంలో సహజ జలవనరులు క్షీణించడం, వర్షపు నీటి మార్గాలు ఆక్రమణలకు గురికావడం వల్ల ప్రతి ఏడాది భారీ వర్షాలకు నగరం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాల సమయంలో వేలాది కాలనీలు జలమయమవడం, వందల కోట్ల రూపాయల ఆస్తినష్టం జరగడం, రవాణా వ్యవస్థ స్తంభించడం వంటి పరిణామాలు పట్టణాభివృద్ధిలో జరిగిన ప్రణాళికా లోపాలను స్పష్టంగా బయటపెట్టాయి. ఈ నేపథ్యంలో చెరువులను పునరుద్ధరించడం, నాలాలను పరిరక్షించడం, ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి విముక్తి చేయడం కోసం ప్రత్యేక వ్యవస్థ అవసరమనే విషయంలో పెద్దగా భిన్నాభిప్రాయం ఉండదు. అదే అవసరం నుంచి "హైడ్రా" వంటి సంస్థ ఆవిర్భవించింది.ఏ ప్రభుత్వ సంస్థకైనా లక్ష్యం ఎంత గొప్పదైనా, దానిని అమలు చేసే విధానం అంతకంటే గొప్పదిగా ఉండాలి. ప్రజాస్వామ్యంలో చట్టం కంటే గొప్ప అధికారం ఎవరికీ లేదు. ప్రభుత్వం రూపొందించిన విధానాలు కూడా రాజ్యాంగం, న్యాయస్థానాల ఆదేశాలు, సహజ న్యాయసూత్రాలకు లోబడే అమలవ్వాలి. ఆక్రమణల తొలగింపు అనేది చట్టబద్ధమైన చర్యే అయినప్పటికీ, దానికి ముందు నోటీసులు ఇవ్వడం, సంబంధిత వ్యక్తులకు తమ వాదనలు వినిపించే అవకాశం కల్పించడం, పత్రాలను పరిశీలించడం, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను గౌరవించడం వంటి కనీస న్యాయపరమైన ప్రక్రియలను పాటించడం తప్పనిసరి. ఇవి కేవలం సాంకేతిక నిబంధనలు కాదు; ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలు.ప్రభుత్వ భూములను రక్షించే క్రమంలో వేల కోట్ల రూపాయల విలువైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం వంటి విజయాలు సాధించిన అధికారులను అభినందించాల్సిందే. అయితే అదే సమయంలో అమలు ప్రక్రియలో పారదర్శకత, సమానత్వం, మానవత్వం కనిపించకపోతే ప్రజల్లో అనుమానాలు పెరగడం సహజం. ముఖ్యంగా చిన్న స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబాలు, జీవితాంతం కూడబెట్టిన పొదుపులతో ఇల్లు కట్టుకున్న సామాన్యులు ఒకేరోజులో నిరాశ్రయులైతే, ప్రభుత్వం లక్ష్యంపై కాకుండా అమలు విధానంపైనే విమర్శలు కేంద్రీకృతమవుతాయి.

చట్టం అందరికీ సమానంగా వర్తించాలనే రాజ్యాంగ సూత్రం ప్రజాస్వామ్యానికి పునాది. ఆక్రమణ చేసిన వ్యక్తి పేదవాడైనా, ధనికుడైనా, రాజకీయ నాయకుడైనా, ప్రభావశీల వ్యాపారవేత్తయినా చట్టం ముందు అందరూ సమానులే. కానీ ప్రజల్లో తరచుగా వినిపించే ప్రధాన విమర్శ ఏమిటంటే, చిన్న ఇళ్లపై చర్యలు వేగంగా జరిగితే, పెద్ద రాజకీయ లేదా ఆర్థిక ప్రయోజనాలున్న నిర్మాణాలపై చర్యలు నెమ్మదిగా సాగుతున్నాయనే భావన. ఈ భావన నిజమా కాదా అన్నది పక్కనపెడితే కూడా, అలాంటి అనుమానం కలగకుండా ప్రభుత్వం వ్యవహరించాల్సిన బాధ్యత ఉంది. చట్టం అమలులో పక్షపాతం కనిపించిన క్షణం నుంచే ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది.

ఇటీవలి సంవత్సరాల్లో దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన కూల్చివేతల విషయంలో న్యాయస్థానాలు ఒకే విషయాన్ని పదేపదే గుర్తు చేస్తున్నాయి. చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించకుండా, ముందస్తు అవకాశాలు ఇవ్వకుండా, విచారణ పూర్తికాకముందే కూల్చివేతలు చేపట్టడం రాజ్యాంగబద్ధ పాలనకు అనుకూలం కాదని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. అందువల్ల ఏ సంస్థ అయినా కోర్టు సూచనలు, ఆదేశాలను అత్యంత గౌరవంతో అమలు చేయాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది. ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఒకదానికొకటి ప్రత్యర్థులు కాదు; పరస్పరం సమతుల్యతను కాపాడే రాజ్యాంగ వ్యవస్థలో భాగాలు.పట్టణాభివృద్ధి విషయంలో మరో ముఖ్యమైన అంశం ప్రభుత్వాల వైఫల్యం కూడా. అనేక ప్రాంతాల్లో సంవత్సరాల తరబడి అక్రమ లేఅవుట్లు, అనుమతిలేని నిర్మాణాలు, చెరువుల పరిధిలో రిజిస్ట్రేషన్లు, మౌలిక వసతులు కల్పించడం వంటి చర్యలు ప్రభుత్వ యంత్రాంగం కళ్లముందే జరిగాయి. ఒకవైపు పన్నులు వసూలు చేయడం, విద్యుత్, తాగునీటి కనెక్షన్లు ఇవ్వడం, మరోవైపు చివరికి అదే ఇళ్లను అక్రమమని ప్రకటించడం వల్ల సాధారణ ప్రజలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో బాధ్యత కేవలం ఇల్లు కొనుగోలు చేసిన పౌరులపై మాత్రమే మోపడం న్యాయసమ్మతం కాదు. ప్రణాళికా లోపాలు, పర్యవేక్షణలో వైఫల్యం, అనుమతుల జారీ ప్రక్రియలో జరిగిన తప్పిదాలపై కూడా సమానంగా విచారణ జరగాలి.

ప్రకృతి వనరుల పరిరక్షణకు ప్రత్యామ్నాయం లేదు. చెరువులు, నాలాలు ఆక్రమితమైతే దాని మూల్యం మొత్తం నగరమే చెల్లించాల్సి వస్తుంది. వాతావరణ మార్పుల ప్రభావంతో స్వల్పకాలంలో అధిక వర్షపాతం నమోదవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సహజ జలమార్గాలను కాపాడటం అత్యవసరం. అయితే పర్యావరణ పరిరక్షణ పేరుతో సామాజిక న్యాయాన్ని విస్మరించడం కూడా సమంజసం కాదు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పౌరహక్కులు---ఈ మూడు ఒకదానికొకటి విరుద్ధమైనవి కావు; సమతుల్యంగా అమలైతేనే ప్రజాస్వామ్య పరిపాలనపై విశ్వాసం బలపడుతుంది.

ఇకపై ప్రభుత్వం హైడ్రా వంటి సంస్థలకు స్పష్టమైన చట్టబద్ధమైన అధికార పరిధిని నిర్వచించాలి. ప్రతి కూల్చివేతకు ముందు డిజిటల్ నోటీసులు, బహిరంగ సమాచారం, అభ్యంతరాల స్వీకరణ, స్వతంత్ర అప్పీల్ వ్యవస్థ వంటి పారదర్శక విధానాలను తప్పనిసరి చేయాలి. చెరువుల పరిరక్షణతోపాటు నిరుపేద కుటుంబాల పునరావాసానికి ప్రత్యేక విధానాన్ని రూపొందించాలి. ప్రత్యామ్నాయ నివాసం లేదా తగిన పునరావాస ప్యాకేజీ లేకుండా పేదలను నిరాశ్రయులను చేయకూడదు. రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రభుత్వ అనుమతులు, భూ రికార్డులు, జలవనరుల పరిమితులను పూర్తిగా వెల్లడించే బాధ్యతను చట్టబద్ధంగా నిర్వర్తించాలి. ప్రజలు కూడా భూమి లేదా ఇల్లు కొనుగోలు చేసే ముందు సంబంధిత ప్రభుత్వ రికార్డులు, అనుమతులు, భూ స్వరూపాన్ని తప్పనిసరిగా ధృవీకరించుకోవాలి. రాజకీయ నాయకులు, ప్రభావశీలులు, సామాన్యులు అనే తేడా లేకుండా అందరికీ ఒకే చట్టం అమలైతేనే హైడ్రా లక్ష్యాలకు ప్రజల మద్దతు లభిస్తుంది. చివరికి గుర్తుంచుకోవాల్సిన సత్యం ఒక్కటే---ప్రకృతి పరిరక్షణకు చట్టం అవసరం, కానీ చట్టానికి మానవత్వం తోడైతేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
ramkishore.1504@gmail.com

---

# గురువును గౌరవించడం భారతీయ సంస్కృతిలో గొప్ప సంప్రదాయం

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేక పూజలు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 29 (జర్నలిస్ట్ డైరీ) :** గురుపౌర్ణమి సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ 6వ వార్డులోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యంత విశిష్టమైన స్థానం ఉందని అన్నారు. మన జీవితానికి సరైన మార్గాన్ని చూపించి, జ్ఞానాన్ని అందించే గురువులను ఎల్లప్పుడూ గౌరవించుకోవాలని సూచించారు. గురువుల ఆశీస్సులు, మార్గదర్శకత్వం ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా సద్గురువులను స్మరించుకోవడంతో పాటు, సత్యం, ధర్మం, సేవా మార్గంలో నడవాలని ఆయన ఆకాంక్షించారు.

సాయిబాబా బోధించిన ప్రేమ, శాంతి, సేవా భావాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురుపౌర్ణమి సందర్భంగా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని సాయిబాబాను ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, కౌన్సిలర్లు రాజు నాయక్, బచ్చలి నరేష్, దిలీప్ కుమార్, కొప్పునూరి ప్రవీణ్ కుమార్, శివ, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు లత శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షుడు విజయ్ కుమార్‌తో పాటు ముబారక్ అలీఖాన్, కమ్మదనం సుధాకర్, వెంకట్ రాంరెడ్డి, శ్రీనివాస్, అమర్నాథ్ రెడ్డి, మహేందర్, చంద్రశేఖర్ రెడ్డి, సంతోష్, బీవీఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సాయిబాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# సీఐ వీరబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఉప సర్పంచ్ అప్పల సిద్ధయ్య




**రంగారెడ్డి,జూలై 29 ( జర్నలిస్ట్ డైరీ ):** నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) వీరబాబును నర్సప్పగూడ గ్రామ ఉప సర్పంచ్ అప్పల సిద్ధయ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సీఐ వీరబాబుకు శాలువా కప్పి సత్కరించారు.అనంతరం ఉప సర్పంచ్ మాట్లాడుతూ..నందిగామ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పోలీసులు సేవలందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కట్న శేఖర్, కురుమ సంఘం అధ్యక్షుడు కట్న శ్రీనివాస్, బీరప్ప, శేఖర్, కృష్ణ, మహేందర్, యాదగిరి భూపాల్ శేఖర్ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతులకు మేలైన విత్తనాల పైన అవగాహన

### - దౌల్తాబాద్ రైతు వేదికలో విత్తన మేళా



**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 29:-** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దౌల్తాబాద్ రైతు వేదికలో బుధవారం విత్తన మేళా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.రాబోయే పంట కాలానికి సంబంధించి రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలనే లక్ష్యంతో ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మార్కెట్లో నాణ్యమైన ధృవీకరించబడిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి వినియోగించుకోవాలని కోరారు.పంట దిగుబడిలో విత్తనం మేలైన రకం కీలక పాత్ర పోషిస్తుందని విత్తనాల ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం సూచించిన పంట రకాలను మాత్రమే సాగు చేయడం వల్ల చీడపీడల ఉధృతి తగ్గి మంచి లాభాలు వచ్చే అవకాశం ఉందన్నారు.అలాగే రైతులు ఏ దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేసినా తప్పనిసరిగా రశీదు (బిల్లు) తీసుకోవాలని నకిలీ విత్తనాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,ఉప సర్పంచ్ సావిత్రమ్మ అశప్ప,మాజీ ఎంపీటీసీ మంజుల దస్తప్ప, సాయిలు,విత్తన డీలర్లు గోపి,విజయ సింహా, వ్యవసాయ అధికారి జి తులసి,ఏఈఓ వైష్ణవి తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# న్యూ మోడల్ బ్రీజా కార్ అవిష్కరణ


### - ఆవిష్కరించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఆవిష్కరణలో పాల్గొన కౌన్సిలర్స్,బీఆర్ఎస్ నాయకులు,యాజమాన్యం




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 28 (జర్నలిస్ట్ డైరీ) :** ప్రముఖ మారుతి సుజుకి డీలర్ శ్రీ జయరామ మోటార్స్ షాద్ నగర్ లోని చటాన్ పల్లిలో గల షోరూమ్‌లో న్యూ బ్రీజా కార్ ఆవిష్కరణ సందర్భంగా పూజా కార్యక్రమం అనంతరం సరికొత్త న్యూ మోడల్ మారుతి సుజుకి బ్రీజా కారును ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సి నవీన్ రెడ్డి మాట్లాడుతూ... మారుతి సుజుకి సంస్థ భారతీయ వాహన రంగంలో దశాబ్దాలుగా మిడిల్ క్లాస్ మరియు సామాన్య ప్రజల నమ్మకాన్ని సొంతం చేసుకుందని కొనియాడారు. మార్కెట్లోకి ఎలాంటి కొత్త మోడల్ తెచ్చినా,అది మైలేజ్ మరియు మెయింటెనెన్స్ పరంగా ప్రజలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు వాణి పాండురంగారెడ్డి,అశోక్ యాదవ్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్,మాజీ సర్పంచులు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు శేరి శ్రీనివాస్ రెడ్డి, దినేష్ సాగర్,అన్వారీ రాజు పేపర్ శివ, మహేష్, యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

# జై బాలాజీ రాంలాల్ స్వీట్ షాప్ ప్రారంభోత్సవం

### - ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా బ్యూరో , జూలై 29 (జర్నలిస్ట్ డైరీ) :** నందిగామ మండలం చేగూర్ గ్రామంలో అరవింద్ ఏర్పాటు చేసిన జై బాలాజీ రాంలాల్ స్వీట్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా షాప్ నిర్వాహకుడు అరవింద్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,వ్యాపారం అభివృద్ధి చెందుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఏసిఎస్ చైర్మన్ మామిళ విట్టల్,బుగ్గొనిగూడ మాజీ సర్పంచ్ రాజు,వార్డు సభ్యులు బీఆర్ఎస్ నాయకులు,బంటారాం మల్లేష్ గౌడ్,శివ చారి,తుక్కుగూడ రవి,గుండాల శ్రీను,నర్సిమ,శ్రీశైలం,రవి, మహేందర్,జగన్,సుధాకర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# సాయిబాబా కృపతో నియోజకవర్గ ప్రజలకు శుభం కలగాలి

**-మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

**-భక్తిశ్రద్ధలతో గురు పూర్ణిమ వేడుకల్లో పాల్గొన్న అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 29 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ నగర్ పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో గురు పూర్ణిమ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, భక్తులు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు స్వాగతం పలికి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, కౌన్సిలర్లు జి.టి వసంత శ్రీనివాస్, శారద శేఖర్, జయలక్ష్మి కిషోర్, గోపాల్, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, బిక్షపతి, ప్రేమ్ కుమార్ గౌడ్, గుండు అశోక్, రాఘవేందర్ గౌడ్, పులిజాల నవీన్, వెంకటేష్, నవీన్, శ్రీకాంత్ తదితరులు సాయిబాబా భక్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి లో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**యాచారం (జులై 29) జర్నలిస్ట్ డైరీ.**
కొత్తపల్లి గ్రామంలో గురుపౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ధర్మశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి బ్రహ్మశ్రీ డా..భార్గవ గురుస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం భక్తులు భక్తిశ్రద్ధలతో శ్రీమద్భగవద్గీత పారాయణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ భార్గవ గురుస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ గురుభక్తి, సనాతన ధర్మం, భగవద్గీత బోధనల విశిష్టతను వివరించారు. ఆయన సందేశాలను భక్తులు ఆసక్తిగా ఆలకించారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోమ రంగయ్య, సోమ సత్యనారాయణ, కుందారం లోహిత్ రెడ్డి, సుమతమ్మ, లక్ష్మి, సోమ రవి, శైలజ తదితరులు పాల్గొన్నారు

# అత్యవసర చికిత్స కొరకు 1,00,000 ఎల్ఓసిని అందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**- లబ్ధిదారునికి అందించిన బీఆర్ఎస్ నాయకులు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 29 (జర్నలిస్ట్ డైరీ) :** కేశంపేట్ మండలంలోని చౌలపల్లి గ్రామానికి చెందిన సాటు పద్మ అనారోగ్యంతో బాధపడుతు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని మెరుగైన వైద్యం కొరకు సహాయం కోరగా స్పందించిన ఎమ్మెల్సి నవీన్ రెడ్డి అత్యవసర చికిత్స కొరకు 1,00,000 ఎల్.ఓ.సి ని మంజూరు చేయించారు. ఈ సందర్బంగా లబ్ధిదారునికి ఎల్ఓసిని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయం షాద్ నగర్ లో బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోమాల్ పల్లి సర్పంచ్ బుర్రి స్వప్న భూపాల్ రెడ్డి, పాపిరెడ్డి గూడెం మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శేఖర్ పంతులు మరియు వార్డ్ మెంబర్ ఆవుల యాదగిరి ,వేముల నర్వ వార్డ్ మెంబర్ దన్నే,మల్లేష్ ,చిర్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసును ఛేదించిన కేశంపేట్ పోలీసులు

**-ముసలి మహిళలే టార్గెట్‌గా గొలుసు దొంగతనాలు**

**-రెండు బంగారు గొలుసులు,ఒక మోటార్‌సైకిల్ స్వాధీనం**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో,జులై 29 ( జర్నలిస్ట్ డైరీ ):** షాద్ నగర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి కేసు వివరాలను వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధితో పాటు మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో వరుసగా జరిగిన గొలుసు దొంగతనాలు, మోటార్‌సైకిల్ చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర ముఠాను కేశంపేట్ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు.పోలీసులు నిందితుల నుంచి రెండు బంగారు మంగళసూత్రాలు, ఒక మోటార్‌సైకిల్ (TS06FC2338),మొబైల్ ఫోన్లు,రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన నిందితులు,సుఖ్‌దేవ్ సింగ్ (38), పంజాబ్,షంషేర్ సింగ్ (36), పంజాబ్,మనుప్రీత్ సింగ్ (24), పంజాబ్,

### మహిళలే లక్ష్యంగా దొంగతనాలు

కేశంపేట్ మండలంలోని సంతాపూర్, మక్తమాదారం ప్రాంతాల్లో కూలి పనులకు కాలినడకన వెళ్తున్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని నిందితులు మోటార్‌సైకిల్‌పై వచ్చి దారి అడిగినట్లు నటిస్తూ మెడలోని బంగారు గొలుసులు లాక్కెళ్లినట్లు పోలీసులు తెలిపారు.మరో ఘటనలో మహిళలను తోసివేసి మూడు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించినట్లు వెల్లడించారు.

### హార్వెస్టర్ ఆపరేటర్ల ముసుగులో నేరాలు

నిందితులు పంటల సీజన్‌లో హార్వెస్టర్ మిషన్ ఆపరేటర్లుగా పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో సంచరించేవారని, స్థానిక రహదారులు, తప్పించుకునే మార్గాలపై అవగాహన పెంచుకుని అదే అవకాశాన్ని ఉపయోగించుకుని గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందని సీపీ తెలిపారు.

### మహబూబ్నగర్,కొత్తకోట, కేశంపేట్, కడ్తాల్‌లో వరుస నేరాలు

మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోటలో మోటార్‌సైకిల్ దొంగిలించి,అదే వాహనంతో గొలుసు దొంగతనం చేసినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం నాందేడ్‌లో కలుసుకున్న ముగ్గురు నిందితులు కలిసి తెలంగాణలో మరిన్ని నేరాలకు కుట్ర పన్నారు. సికింద్రాబాద్‌కు రైలులో వచ్చి, అక్కడి నుంచి మోటార్‌సైకిల్ చోరీ చేసి కేశంపేట్, కడ్తాల్ ప్రాంతాల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడ్డారు.
మరో నేరానికి సిద్ధమవుతున్న సమయంలో షాద్‌నగర్ సమీపంలోని కేశంపేట్ క్రాస్‌రోడ్ వద్ద పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు..ఈ కేసులను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి పర్యవేక్షణలో, షాద్‌నగర్ డీసీపీ శిరీష రాఘవేందర్, ఏసీపీ లక్ష్మీనారాయణ మార్గదర్శకత్వంలో, నిజామాబాద్ పోలీసుల సహకారంతో కేశంపేట్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు.

### షాద్‌నగర్ పోలీసుల మరో విజయం

ఇటీవల షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హెచ్‌బీ బై నైట్ కేసును కూడా పోలీసులు ఛేదించారు.ఈ కేసులో 18 తులాల బంగారం, 7 తులాల వెండి,30 వేల నగదు స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అలాగే పలు బైక్ చోరీ కేసులను కూడా ఛేదించి మూడు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.ప్రజలు ఆస్తి సంబంధిత నేరాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా పోలీసులకు సహకరించాలని సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిసిపి శిరీష రాఘవేందర్, షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ, కేశంపేట్ సిఐ నరహరి, ఎస్సై రాజ్ కుమార్, క్రైమ్ టీం మరియు కేశంపేట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో చందానగర్ డివిజన్‌లో అర్ధరాత్రి పర్యటించిన పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరిక!**



**చందానగర్ జూలై 29 (జర్నలిస్ట్ డైరీ) :** భారీ వర్షం కారణంగా చందానగర్ డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య కాలనీ లో ఏర్పడిన పలు సమస్యల పై ముంపు ప్రాంతాల్లో సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి మరియు సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారుల తో కలిసి అర్ధరాత్రి పర్యటించి స్వయంగా పరిశీలించిన పియేసి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ.
ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.... నిన్న రాత్రి కురిసిన భారీ వర్షం పట్ల కాలనీ లలో నెలకొన్న పలు సమస్యలు మరియు ముంపు ప్రాంతములో పర్యటించి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది. సెల్లార్ లో నిండిన నీటి నీ మోటార్ల సహాయం తో బయటకు పంపించడం జరిగినది. సకాలంలో స్పందించడం జరిగినది.కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని తెలియచేశారు. నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడలని, వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని , వర్షాకాలంలో గల ఎదురయ్యే సమస్యల పట్ల పూర్తి స్థాయిలో అధికారులు సన్నద్ధం అవ్వాలని మాన్ సున్ సిబ్బందిని అప్రమత్తంగా ఉండేలా చూడలని, అన్ని అధికారులకు ఈ ప్రజల పట్ల ప్రజలందరూ అప్రమత్రంగా ఉండాలని , వర్షాల వల్ల ఎటువంటి సమస్యలు ఎదురైన మా దృష్టికి తీసుకురావలని ప్రజలకు విజ్ఞప్తి చేసిన గాంధీ .
వర్షం కురుస్తున్న సమయంలో ప్రజలు, ప్రతి కాలనీ వాసులు, తమ ఇండ్ల నుంచి ఎవరు బయటకి రావొద్దు అని, అత్యవసరం తప్పితే ఎవరు బయటకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని , ఎటువంటి ఇబ్బందులు కలిగిన,(ఎలక్ట్రికల్, రోడ్డు, డ్రైనేజీ ,మంచి నీటి) వంటి సమస్య లు ఎదురైన , వెంటనే సంబంధిత అధికారులకు గాని, మాకు గాని, మా కార్యాలయంకు గాని సంప్రదించవల్సిందిగా మనవి అని తెలియచేసిన తెలియచేసారు.
తాజా మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండలని కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, అదేవిధంగా వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎంసీ అధికారులు ,హైడ్రా సిబ్బంది, మరియు మాన్ సున్ ఎమర్జెన్సీ టీమ్స్ ,డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండలని , అధికారులందరు క్షేత్ర స్థాయిలో ఉండి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండ చూడలని , ప్రజలు అభద్రత కు లోను కాకుండా ధైర్యంగా ఉండలని, వర్షాలు పడుతున్న సమయంలో ఇంటి నుండి బయటకి రాకుండా ఉండలని తప్పని పరిస్థితుల్లో బయటకి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదేవిధంగా అధికారులు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలు ,నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఇబ్బంది కల్గకుండా, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని,అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిత్యం ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ,ఎక్కడ ఏ సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చూడాలని అధికారులకు తెలియచేసారు, అధికారులకు పలు సలహాలు,సూచనలు ఇవ్వడం జరిగినది. నిత్యం అందుబాటులో ఉంటానని ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి గాని , మా కార్యాలయం దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని, అదేవిధంగా భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలియచేసారు .
వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు..
1.తడిసిన కరెంట్ స్థంబాలను ముట్టుకోరాదు.
2. తడిసిన చేతులతో స్టార్టర్లు కానీ మోటార్లు కానీ ముట్టుకోరాదు.
3.విద్యుత్ లైన్ కు తగులుచున్న చెట్లను ముట్టుకోరాదు.
4.విద్యుత్ లైన్ కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియచేయవలెను.
5.పార్కులలో గాని స్టేడియంలో గాని విద్యుత్ స్తంభాలు ముట్టుకోరాదు.
6.ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డు లను తడి చేతులతో ముట్టుకోరాదు..
7.బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలి.
8.కరెంటు కు సంబంధించిన వస్తువులు తడి చేతులతో ముట్టుకోరాదు.
9.చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలి.
10.క్వార్టర్ లలో ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదు..
11.గాలి,దుమారం,వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదు.
12.ఇంట్లో ఉన్న వాటర్ హీటర్ యొక్క స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే నీళ్లు పెట్టిన వస్తువును ముట్టవలెను.
13.ఉరుములు మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయవలెను.
14.వర్షం పడుచున్నప్పుడు టీవీ,ఫ్రిడ్జ్ మరియు కంప్యూటర్ ల యొక్క స్విచ్ లను ఆఫ్ చేయవలెను, లేనిచో వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుంది.
15.కరెంటు లైన్ క్రింద సెల్ ఫోన్ మాట్లాడకూడదు.
16.ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైన డ్యామేజ్ అయినచో సంబంధించిన అధికారి జీవీ,ఆావీ, LM లేదా AE దృష్టికి తీసుకెల్లాలి అని తెలియచేసారు
ఈ కార్యక్రమంలో సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏఈ ప్రతాప్, నాయకులు రఘునాథ్ రెడ్డి, బాలింగ్ గౌతమ్ గౌడ్, అక్బర్ ఖాన్, శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్ జమీర్, సాదిక్ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# గురుపౌర్ణమి శుభసందర్భంగా హుడా కాలనీ ఫేస్ 2 లో గల సాయి బాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన గాంధీ.

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 29 (జర్నలిస్ట్ డైరీ) :**
గురుపౌర్ణమి శుభసందర్భంగా చందా నగర్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ ఫేస్ 2 లో గల సాయి బాబా దేవాలయంలో జరిగిన గురుపౌర్ణమి వేడుకలలో సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... గురువులను, ఉపాధ్యాయులను, పెద్దలను పూజించే రోజును గురు పౌర్ణమి లేదా వ్యాస పౌర్ణమి అని పిలుస్తారు. ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున గురుపౌర్ణమి జరుపుకుంటారు. ఈ రోజున గురుపూజోత్సవం జరిపి గురువులకు కానుకలు బహుమతులు సమర్పించి వారిని సత్కరించి వారి ఆశీర్వాదములు తీసుకొంటారు. తమ జీవితానికి




మార్గనిర్దేశం చేసి, ముక్తి వైపు నడిపించివందుకు ప్రతిఫలంగా ఇలా చేస్తారు. గురువుల పట్ల ఇదే గౌరవం అన్నివేళలా పాటిస్తున్నప్పటికీ ఈ రోజు వ్యాసమహాముని పుట్టిన రోజు కాబట్టి ఈ రోజుకంత ప్రాధాన్యత ఉంది అని తెలియచేశారు. గురువు అంటే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించేవాడు. చాలామంది హిందువులు తమ గురువులతో జీవితాంతం అనుబంధం ఏర్పరుచుకుని ఉంటారు. ఇది కుటుంబ సంబంధం కూడా కావచ్చు. తర తరాలకూ కొనసాగవచ్చు అని అన్నారు. గురువును భగవంతునికి భక్తునికి మధ్య సంధాన కర్తగా భావిస్తుంటారు. వేదవ్యాసుని మానవజాతి కంతతికీ మంచి ఆధ్యాత్మిక వారసత్వాన్ని మిగిల్చి వెళ్ళాడు కాబట్టి ఆయన్ను మానవాళికంతటికీ గురువుగా భావిస్తుంటారు. వేదవ్యాసుని పూర్వనామం కృష్ణ ద్వైపాయనుడు. వేదకాలపు సంస్కృతినంతా నాలుగు వేదాల్లో ఆయన సంకలనం చేసిన తరువాత ఆయన్ను వేదవ్యాసుడిగా పిలవడం ప్రారంభించారు అని తెలియచేశారు. ఈ కార్యము నాయకులు రఘునాథ్ రెడ్డి, ఉరిటి వెంకట్ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ నాయక్, రాజయ్య, నాగరాజు, వెంకటేష్, రాజశేఖర్ మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# హఫీజ్‌పేట్ డివిజన్ వైశాలీనగర్ నాలాలో గల్లంతైన వృద్ధుడు బాలయ్య కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు

**ఘటనా స్థలిని పరిశీలించి, అధికారులకు ఆదేశాలు జారీ చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ!**

**హైదరాబాద్ (జర్నలిస్ట్ డైరీ):**
గల్లంతైన వ్యక్తి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలను వేగవంతం చేయాలని పోలీసు, హైడ్రా,ఎన్డీఆరఎఫ్ , సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులకు పలు సూచనలు.
బాలయ్య కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.
ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... వైశాలి నగర్ రైల్వే అండర్ పాస్ వద్ద ప్రమాదవశాత్తు మ్యాన్ హోల్ బాలయ్య జరిపడటం చాలా బాధారమైన విషయం అని, సంఘటన చాలా దురదృష్టకరం అని, గల్లంతైన వ్యక్తి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలను వేగవంతం చేయాలని పోలీసు,



హైడ్రా,ఎన్డిఆర్ఎఫ్ , సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులకు తెలియచేసి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది అని అర్ధరాత్రి రెండు గంటల వరకు నాలా ఔట్ లెట్ మరియు చెరువు ఇన్ లెట్ ఔట్ లెట్ లను క్షుణ్ణంగా స్వయంగా ప్రత్యక్షంగా దగ్గరుండి పరిశీలించడం జరిగినది అని తెలియచేశారు . గాలింపు చర్యలను ముమ్మరం చేశాం అని, అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, శాయశక్తుల కృషి చేస్తున్నామని, ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలను కొనసాగిస్తామని తెలియచేశారు. వర్షాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని , అత్యవసరం తప్పితే బయటకు రాకూడదు అని, అధికారులు కూడా వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, పనులు జరుగుతున్న ప్రాంతాలలో రక్షణ చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహించకూడదు అని తెలియచేశారు. గల్లంతైన వ్యక్తి బాలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కి ధైర్యంగా ఉండాలని , మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా సహాయం సహకారాలు అందేలా చూస్తానని, తన వంతు సహాయం ఎల్లవేళలో ఉంటుంది అని తెలియచేశారు.

# వైశాలీనగర్ నాలాలో వృద్ధుడు గల్లంతు

**గాలింపు చర్యలను పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 29 (జర్నలిస్ట్ డైరీ) :**
హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని వైశాలి నగర్ వద్ద ఉన్న రైల్వే అండర్ పాస్ వద్ద ప్రమాదవశాత్తు నాలా లో గల్లంతైన వ్యక్తి బాలయ్య(70) ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలో భాగంగా డీసీ శ్రీ శ్రీనివాస్, డీసీ శ్రీ సేవా ఇస్లావత్ గారు, టౌన్ ప్లానింగ్ ప్లానర్ శ్రీ శ్యామ్ గారు మరియు సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించిన పియేసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ.
గల్లంతైన వ్యక్తి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలను వేగవంతం చేయాలని పోలీసు, హైడ్రా,ఎన్డీఆరఎఫ్ , సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులకు పలు సూచనలు.
బాలయ్య కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.
ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... వైశాలి నగర్



రైల్వే అండర్ పాస్ వద్ద ప్రమాదవశాత్తు మ్యాన్ హోల్ బాలయ్య జరిపడటం చాలా బాధారమైన విషయం అని, సంఘటన చాలా దురదృష్టకరం అని, గల్లంతైన వ్యక్తి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలను వేగవంతం చేయాలని పోలీసు, హైడ్రా, ఎన్డీఆరఎఫ్, సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులకు తెలియచేసి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది అని అర్ధరాత్రి రెండు గంటల వరకు నాలా ఔట్ లెట్ మరియు చెరువు ఇన్ లెట్ ఔట్ లెట్ లను క్షుణ్ణంగా స్వయంగా ప్రత్యక్షంగా దగ్గరుండి పరిశీలించడం జరిగినది అని తెలియచేశారు . గాలింపు చర్యలను ముమ్మరం చేశాం అని, అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, ప్రతి మ్యాన్ హోల్ నుండి మ్యాన్ హోల్ వరకు క్షణంగా పరిశీలించడం జరిగినది అని, వేగవంతంగా చేసి ఆచూకీ కనుకుంటామని, ఆచూకీ కోసం శాయశక్తుల కృషి చేస్తున్నామని, ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలను కొనసాగిస్తామని తెలియచేశారు. వర్షాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని , అత్యవసరం తప్పితే బయటకు రాకూడదు అని, అధికారులు కూడా వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, పనులు జరుగుతున్న ప్రాంతాలలో రక్షణ చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహించకూడదు అని తెలియచేశారు.
గల్లంతైన వ్యక్తి బాలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కి ధైర్యంగా ఉండాలని , మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా సహాయం సహకారాలు అందేలా చూస్తానని, తన వంతు సహాయం ఎల్లవేళలో ఉంటుంది అని తెలియచేశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగ ఉండాలి

**- కొడంగల్ ఎస్సై సత్యనారాయణ ప్రజలకు అత్యవసర హెచ్చరిక**

**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 29:-**
రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల ప్రాణ ఆస్తి రక్షణే ధ్యేయంగా కొడంగల్ ఎస్సై సత్యనారాయణ రంగంలోకి దిగారు. రానున్న గంటల్లో వర్ష తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండటంతో మండల ప్రజలు పరిసర ప్రాంతాల వాసులు వర్ష తీవ్ర దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సత్యనారాయణ భద్రతా సూచనలు జారీ చేశారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని కొడంగల్ ఎస్సై సత్యనారాయణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు వంకలు చెరువులు వరద నీటి ప్రవాహాల వద్దకు



వెళ్లడం అత్యంత ప్రమాదకరమని ఎస్సై స్పష్టం చేశారు. నీటి ప్రవాహ తీవ్రతను అంచనా వేయకుండా దాటేందుకు ఎవరూ సాహసించవద్దని హెచ్చరించారు. వర్షాల వల్ల ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగిపడినా విద్యుత్ స్తంభాలు తడిసి ఉన్నా వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. ఏమాత్రం ప్రమాదం పొంచి ఉన్నట్లు అనుమానం వచ్చినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని వరద నీరు చేరిన లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు నిరంతరం కనిపెట్టుకుని ఉండాలని ఎస్సై హెచ్చరించారు. వాతావరణ శాఖ జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలను పాటించాలని ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా విపత్తు ఎదురైతే వెంటనే డయల్ 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేసి పోలీస్ సహాయం పొందవచ్చని లేదా నేరుగా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై సత్యనారాయణ స్పష్టం చేశారు.

# మొక్కలు నాటి.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం: సర్పంచ్ రాజు నాయక్



**మిడ్జిల్, జులై 29,జర్నలిస్ట్ డైరీ**
మిడ్జిల్ మండలం పెద్దగుండ్ల తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మర్లబాయి తండాలో బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాజు నాయక్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు కలిసి మొక్కలు నాటారు.
ఈ సందర్భంగా సర్పంచ్ రాజు నాయక్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించి, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న హరితహారం లక్ష్యాలను విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఉప సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని జీవించేలా సంరక్షించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు గ్రామ పంచాయతీ తరఫున నిరంతరం చర్యలు చేపడుతున్నామని, ప్రతి ఇంటి ఆవరణలో, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పచ్చని వాతావరణాన్ని నెలకొల్పాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో యువత, మహిళలు, విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శైలజ, అంగన్వాడి టీచర్ మాధవి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి ప్రత్యేక పూజల్లో మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్



**కొత్తపేట, జూలై 29 జర్నలిస్ట్ డైరీ**
గురు పౌర్ణమి సందర్భంగా కొత్తపేట డివిజన్ పరిధిలోని గాయత్రిపురం గణపతి, సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులకు గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వగ్గుల సుందర్ నారాయణ, జంగారెడ్డి, కాటా విజయ గౌడ్, లావణ్య, స్వర్ణ, యశోద, రామకృష్ణ, వెంకట్ రెడ్డి, డివిజన్ జనరల్ సెక్రటరీ గట్టు మహేష్ కుమార్, రాజేష్ ఖన్నా, నందు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరిపై సాయిబాబా ఆశీస్సులు ఉండాలి

**● అల్కాపురి సాయిబాబా ఆలయ ప్రధాన పూజారి జయంత్**



**ఆర్కేపురం, జూలై 29 జర్నలిస్ట్ డైరీ**
గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ పరిధిలోని అల్కాపురి సాయిబాబా ఆలయంలో



బుధవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి జయంత్ మాట్లాడుతూ సాయిబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డాక్టర్ విశ్వేశ్వరరావు, ట్రస్టీ వీరేందర్, డి. కళ్యాణ్, ఆనుముల్, సంతోష్, తేజ, కోటేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..

**– బీఎస్ఈ సెన్సెక్స్ 888 పాయింట్లు లాభం**



భారత స్టాక్ మార్కెట్ బుధవారం లాభాల్లో ముగిసింది. బెంచ్‌మార్క్ 1 శాతం పెరిగింది. ఐటీ, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల జోష్ పెరగడంతో మార్కెట్ లాభాలబాట పట్టింది. బీఎస్ఈ సెన్సెక్స్ 88 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 264 పాయింట్లు పెరిగాయి. ట్రేడింగ్ ఈ రోజు 77,765.49 పాయింట్ల గరిష్టాన్ని చేరగా, 77,333.24 పాయింట్ల కనిష్టాన్ని తాకింది. చివరకు 888.68 పాయింట్ల లాభం (1.16 శాతం)తో 76,654.60 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 264.85 పాయింట్లు (1.1 శాతం) లాభపడి 24,250.20 వద్ద ముగిసింది.బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 50.16 పాయింట్లు, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 102.92 పాయింట్లు లాభపడ్డాయి. నిఫ్టీ ఐటీ షేర్లు 2.32 శాతం, నిఫ్టీ రియాల్టీ షేర్లు 2.31 శాతం లాభపడ్డాయి. అలాగే, నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ షేర్లు కూడా భారీ లాభాల్లో ముగిశాయి. హిందుస్తాన్ యునిలీవర్, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, ట్రెంట్, లార్సెన్ అండ్ టర్బో భారీ లాభాల్లో ముగిశాయి. వీటిలో హిందుస్తాన్ యునీలీవర్ 4.70 శాతం లభపడింది. మరోవైపు అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎంఅండ్ఎం, పవర్ గ్రిడ్, ఎన్టీపీసీ నష్టాల్లో ముగిశాయి. అందులో అదానీ పోర్ట్స్ షేర్లు 3.19 శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ 30 షేర్లలో 25 షేర్లు బుధవారం లాభాల్లోనే ముగిశాయి. 50 నిఫ్టీ షేర్లలో 38 షేర్లు లాభాల్లో ముగిశాయి. 12 మాత్రమే నష్టాలు చవిచూశాయి. డాలర్‌తో రూపాయి మారక విలువ బుధవారం 0.11 శాతం లాభపడి, 95.62 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ ధర 87.65 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,031.84 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## పాకిస్తాన్‌లో ఆకాశాన్నంటిన కోడిగుడ్ల ధరలు

**-డజను గుడ్లకు రూ.315.. ఒక్కో గుడ్డు రూ.26 వరకు విక్రయం**

**-సోయాబీన్ కొరతతో కోళ్ల దాణా ధరలు పెరుగుదల.. సామాన్యులపై తీవ్ర భారం**

ఇస్లామాబాద్,
ఇప్పటికే తీవ్ర ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న పాకిస్తాన్ ప్రజలకు కోడిగుడ్ల ధరలు మరో భారంగా మారాయి. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండగా, ప్రస్తుతం కోడిగుడ్ల ధరలు కూడా రికార్డు స్థాయికి చేరుకోవడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేశంలోని పలు నగరాల్లో రిటైల్ మార్కెట్లలో డజను కోడిగుడ్ల ధర రూ.315 వరకు చేరింది. దీంతో ఒక్కో గుడ్డు ధర సుమారు రూ.26 పలుకుతోంది. కొద్ది నెలల క్రితం వరకు అందుబాటు ధరలో లభించిన గుడ్లు ఇప్పుడు సాధారణ కుటుంబాలకు కూడా భారంగా మారాయి. ముఖ్యంగా తక్కువ ఆదాయ వర్గాలు, రోజువారీ కూలీలు, మధ్యతరగతి కుటుంబాలు గుడ్ల కొనుగోలును తగ్గించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానిక



వ్యాపారులు చెబుతున్నారు. ధరల పెరుగుదలకు ప్రధాన కారణం కోళ్ల దాణా కొరతేనని పౌల్ట్రీ రంగానికి చెందిన నిపుణులు పేర్కొంటున్నారు. కోళ్లకు ప్రధానంగా ఉపయోగించే సోయాబీన్ సరఫరా దేశంలో భారీగా తగ్గిపోవడంతో దాణా తయారీ వ్యయం గణనీయంగా పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి సరుకుల ధరలు పెరగడం, దిగుమతుల వ్యయం అధికమవడం, రవాణా ఖర్చులు పెరగడం వంటి అంశాలు కూడా కోళ్ల పెంపకందారులపై అదనపు భారం మోపాయి. దాణా ఖర్చులు పెరగడంతో పౌల్ట్రీ రైతులు ఉత్పత్తి వ్యయాన్ని భర్తీ చేసుకునేందుకు గుడ్ల ధరలను పెంచాల్సి వస్తోందని వ్యాపార సంఘాలు వెల్లడించాయి. ఫలితంగా వినియోగదారులపై నేరుగా ధరల భారం పడుతోంది. దేశవ్యాప్తంగా పౌల్ట్రీ పరిశ్రమ కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో గుడ్లతో పాటు చికెన్ ధరలు కూడా మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక ఇప్పటికే గోధుమపిండి, బియ్యం, వంటనూనె, పాలు, చక్కెర, కూరగాయలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు కోడిగుడ్ల ధరల పెరుగుదల మరో ఎదురుదెబ్బగా మారింది. ప్రోటీన్‌కు చౌకైన ఆహారంగా భావించే గుడ్లు కూడా సాధారణ ప్రజలకు అందని వస్తువుగా మారుతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, కోళ్ల దాణా ముడి పదార్థాల సరఫరాను మెరుగుపరచడంతో పాటు పౌల్ట్రీ రంగానికి అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని పరిశ్రమ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## తగ్గిన బంగారం ధరలు.. పసిడి ప్రియులకు ఊరట

**-24 క్యారెట్లపై రూ.660, 22 క్యారెట్లపై రూ.600 తగ్గుదల**

**-వెండి ధర కూడా స్వల్పంగా తగ్గుముఖం**

**హైదరాబాద్,**
బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి ఊరటనిచ్చే వార్త ఇది. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న ధరల మార్పుల ప్రభావంతో దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు బుధవారం గణనీయంగా తగ్గాయి. దీంతో పసిడి ప్రియులు, ఆభరణాల కొనుగోలుదారులు కొంత ఉపశమనం పొందుతున్నారు. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం 10 గ్రాముల ధర రూ.660 తగ్గి రూ.1,43,510కు చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.600 తగ్గి రూ.1,31,550 వద్ద కొనసాగుతోంది. ఇటీవల వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలకు ఈ తగ్గుదల కొంత విరామం ఇచ్చిందని బులియన్



వ్యాపారులు పేర్కొంటున్నారు. అటు వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది. కిలో వెండి ధర రూ.100 తగ్గి రూ.2,34,900కు చేరుకుంది. పరిశ్రమల అవసరాలు, అంతర్జాతీయ మార్కెట్ ధోరణులు, పెట్టుబడిదారుల కొనుగోలు విధానాలు వంటి అంశాలు వెండి ధరలపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు వెల్లడిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు, అమెరికా డాలర్ మారకం విలువ, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల విధానాలు, భౌగోళిక-రాజకీయ పరిణామాలు వంటి అంశాలు దేశీయ బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. ఈ కారణంగానే ధరల్లో రోజువారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే, హైదరాబాద్‌లో నమోదైన ధరలతో పోలిస్తే తెలుగు రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల్లో రవాణా ఖర్చులు, స్థానిక పన్నులు, జీఎస్టీ, మేకింగ్ చార్జీలు తదితర కారణాల వల్ల స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉందని బులియన్ వ్యాపారులు సూచిస్తున్నారు. బంగారం కొనుగోలు చేసే ముందు స్థానిక బులియన్ మార్కెట్‌లో తాజా ధరలను తెలుసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# స్పోర్ట్స్

## టీ20 ర్యాంకింగ్స్‌లో చరిత్ర సృష్టించిన ఛోటా ప్యాకెట్..

**కోహ్లీ, సూర్యలనే బీట్ చేశాడుగా..!**

ఐసీసీ విడుదల చేసిన టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టీమ్ ఇండియా వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్ తన నంబర్ 1 స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. 916 రేటింగ్ పాయింట్లతో కిషన్ మరో ముఖ్యమైన మైలురాయిని సాధించాడు. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ తర్వాత అత్యధిక రేటింగ్ ఉన్న మూడో బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు.ప్రస్తుత టీ20 ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ 3వ స్థానానికి పడిపోయాడు. అయితే, టీ20 ర్యాంకింగ్స్‌లో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన రికార్డు అతని పేరిట ఉంది. ఈ జాబితాలో ఇంగ్లండ్‌కు చెందిన డేవిడ్ మలన్ 2వ స్థానంలో ఉండగా, ఇషాన్ కిషన్ 3వ స్థానంలో ఉన్నాడు. గమనించదగ్గ విషయం ఏమిటంటే, టాప్ ఐదు స్థానాల్లో నలుగురు భారత ఆటగాళ్లు ఉండగా, ఈ జాబితాలో డేవిడ్ మలన్ ఒక్కడే భారతీయుడు కాని ఆటగాడు. అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత ఆటగాళ్ల జాబితాలో ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లీలను అధిగమించాడు. విరాట్ అత్యుత్తమ టీ20 రేటింగ్ పాయింట్ల మొత్తం 909 కాగా, సూర్య 912 రేటింగ్



పాయింట్లు సాధించాడు. ఇప్పుడు ఇషాన్ వారిద్దరినీ అధిగమించాడు.అయితే, అభిషేక్ శర్మ 931 రేటింగ్ పాయింట్లతో టీ20 ర్యాంకింగ్స్‌లో అత్యధిక రేటింగ్ పొందిన ఆటగాడిగా ఉన్నాడు. అభిషేక్ శర్మ సుమారు 11 నెలల పాటు అంతర్జాతీయ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానంలో నిలిచాడు. గత ఏడాది జూలైలో అభిషేక్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ నెల ప్రారంభంలో, ఇషాన్ కిషన్ అభిషేక్‌ను అధిగమించి అగ్రశ్రేణి బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. జింబాబ్వే పర్యటనలో, ఇషాన్ కిషన్ తాను ఆడిన మూడు టీ20లలో 48.33 సగటుతో 145 పరుగులు చేశాడు. అతని స్ట్రైక్ రేట్ 154కు పైగా ఉంది. ఈ సిరీస్‌లో అతని ప్రదర్శన అతని రేటింగ్ పాయింట్లు పెరగడానికి దారితీసింది.


## జాతీయ జట్టుకు వీడ్కోలు: నెయ్‌మార్



ఫుట్‌బాల్ బ్రెజిల్ జాతీయ జట్టుకు వీడ్కోలు పలుకుతున్నట్లు దిగ్గజ క్రీడాకారుడు నెయ్‌మార్ (34) జూనియర్ తెలిపాడు. 16 ఏండ్ల కెరీర్ నుంచి రిటైర్ అవుతున్నట్లు అతడు అధికారికంగా బుధవారం వెల్లడించాడు. బ్రెజిల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా అతడు రికార్డు నెలకొల్పాడు. ఫిఫా వరల్డ్ కప్-2026లో లీగ్ దశలో బ్రెజిల్ నార్వే చేతిలో 2-1 తేడాతో ఓడిపోయింది. దీంతో వరల్డ్ కప్ నుంచి బ్రెజిల్ నిష్క్రమించింది. అప్పుడు జాతీయ జట్టుకు రిటైర్‌మెంట్ ప్రకటించాడు.దేశం తరఫున చెమటోడ్చాను, పసుపు రంగు జెర్సీ వేసుకొని పోరాడాను. ఇక ఆ జెర్సీని ధరించను అని అన్నాడు. ఫుట్‌బాల్ ప్రపంచకప్, కోపా అమెరికా, ఒలింపిక్స్‌లలో ఆడాడు. కోపా సుండామెరికానా టోర్నీలో శాంటోస్ క్లబ్ తరఫున ఆడగా 4-2 తేడాతో యూనివర్సిడాడ్ సెంట్రల్ జట్టు ఓడిపోయింది. ఈ సమయంలో డ్రెస్సింగ్ రూమ్‌లో సహచర యువ ఆటగాళ్లను వెక్కిరించి, బెదిరించాడని వచ్చిన వార్తలను అతడు ఖండించిన సందర్భంగా జాతీయ జట్టుకు రిటైర్‌మెంట్‌ను ప్రకటించాడు. నెయ్‌మార్ జూనియర్ బ్రెజిల్ జాతీయ జట్టు తరఫున 2010లో అరంగేట్రం చేశాడు. 2013 ఫిఫా వరల్డ్ కప్‌లో విజయం సాధించడంలో అతడు కీలక పాత్ర పోషించాడు. 2016 రియో ఒలింపిక్స్ లో స్వర్ణం సాధించి జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. బ్రెజిల్ తరఫున నెయ్‌మార్ 130 మ్యాచ్‌లు ఆడి 80 గోల్స్ సాధించాడు.

## 10,000 మీటర్ల పరుగులో..
## గుల్వీర్ సింగ్‌కు సిల్వర్ మెడల్

**గ్లాస్‌గో:**
భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ చరిత్ర సృష్టించాడు. కామన్‌వెల్త్ క్రీడల్లో మెన్స్ 10వేల మీటర్ల ఈవెంట్‌లో పతకం సాధించిన తొలి భారతీయుడిగా నిలిచాడు. ఆ ఈవెంట్‌లో గుల్వీర్ .. రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. జాతీయ రికార్డు హోల్డర్ అయిన గుల్వీర్.. కామెన్‌వెల్త్ గేమ్స్‌లో ఇండియాకు అథ్లెటిక్స్‌లో రెండో సిల్వర్ మెడల్ అందించాడు. ఇదే మెగా ఈవెంట్‌లో మెన్స్ హై జంప్ కేటగిరీలో సర్వేశ్ కుషేర్ కూడా సిల్వర్ మెడల్ గెలుచుకున్నాడు. గుల్వీర్ సింగ్ 27:49.78 సెకన్లలో పదివేల మీటర్ల పరుగును ఫినిష్ చేశాడు. మొదటి స్థానంలో ఆస్ట్రేలియా అథ్లెట్ కై రాబిన్‌సన్ ఉన్నాడు. 27:48.93 సెకండ్స్ టైంతో రాబిన్‌సన్ స్వర్ణ పతకాన్ని ఎగురేసుకుపోయాడు.గ్లాస్‌గోలోని స్కాట్‌స్టోన్ స్టేడియంలో భారీ వర్షం మధ్య పదివేల మీటర్ల ఈవెంట్‌ను నిర్వహించారు. ప్రతికూల వాతావరణంలోనూ భారత అథ్లెట్ గుల్వీర్ అద్భుత ప్రదర్శన ఇచ్చాడు. ఆరంభం నుంచి లీడింగ్‌లో ఉన్న 28 ఏళ్ల గుల్వీర్.. ఫినిషింగ్ ల్యాప్స్ సమయంలో అద్భుతంగా దూసుకెళ్లాడు. మెడల్ గెలవడం




ఎప్పుడూ సంతోషాన్ని ఇస్తుందని, రేస్ బాగా జరిగిందని, వర్షం ఉన్నా.. మెడల్ గెలవడం వల్ల అవన్నీ మరిచిపోతామని, ఎండ, వాన, వేడి ఇవేమీ గుర్తుకు రావని ఆసియా చాంపియన్ గుల్వీర్ అన్నారు. అన్నీ భగవంతుడిపైనే వదిలేశానని అన్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని అత్రౌలీకి చెందిన అతను ప్రస్తుతం ఆర్మీలో చేస్తున్నాడు. తన ఈవెంట్ గురించి ఫ్యామిలీకి ఇంకా చెప్పలేదన్నాడు. ఇప్పుడు తాను 5కే రన్‌పై ఫోకస్ పెట్టినట్లు చెప్పారు. అమెరికాలోని స్కాట్ సిమ్మన్స్ సమక్షంలో గుల్వీర్ శిక్షణ పొందుతున్నాడు. అయితే ఆఫ్రికన్ రన్నర్స్ ఉన్న ఈ ఈవెంట్‌లో చాలా చాకచక్యంగా గుల్వీర్ తన రేస్‌ను కొనసాగించాడు. 10,000 మీటర్ల పరుగులో 1986 కామన్‌వెల్త్ క్రీడల తర్వాత తొలిసారి పోడియంపై ఆఫ్రికా అథ్లెట్ కనిపించలేదు. మహిళల హై జంప్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. ఆసియా చాంపియన్ పూజా సింగ్.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. 1.82 మీటర్ల ఎత్తును ఆమె క్లియర్ చేయలేకపోయింది. వర్షం వల్ల 19 ఏళ్ల పూజ సరైన రీతిలో పర్ఫార్మ్ చేయలేదు.





## 800కుపైగా ఆర్టిస్టులతో.. శర్వానంద్ భోగి క్లైమాక్స్ షెడ్యూల్ కంప్లీట్

టాలీవుడ్ శర్వానంద్ నటిస్తున్న చిత్రం 'భోగి'. పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రానికి సంపత్‌నంది దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. కాగా ఆర్ట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ మన్నె సారథ్యంలో నిర్మించిన భారీ సెట్‌లో స్టంట్ కొరియోగ్రాఫర్ దిలీప్ సుబ్బరాయన్ నేతృత్వంలో క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నట్టు వార్తలు కూడా వచ్చాయి. ఈ సీక్వెన్స్ కోసం శర్వానంద్‌కు రోజూ రెండన్నర గంటల పాటు మేకప్ సెషన్ పెట్టారట.తాజాగా దీనికి సంబంధించి కీలక అప్‌డేట్ బయటకు వచ్చింది. భోగి 3 నెలల ప్లానింగ్ షెడ్యూల్‌లో 22 రోజులపాటు 800 మందికిపైగా జూనియర్ ఆర్టిస్టు టీంతో షూట్ చేసిన క్లైమాక్స్ సీక్వెన్స్ పూర్తయింది. సెట్స్‌లో శర్వానంద్ కుర్చీలో కూర్చొని కనిపిస్తుండగా.. ఎదురుగా జూనియర్ ఆర్టిస్టులు అండ్ విలన్ టీం ఉన్న స్టిల్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. క్లైమాక్స్ సీక్వెన్స్ భోగి సినిమాకే హైలెట్‌గా నిలిచిపోయేలా గూస్‌బంప్స్ తెప్పించబోతుందని ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో 1960స్ ఫిక్షనస్ విలేజ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీ ఆగస్టు 28న గ్రాండ్‌గా విడుదలకు రెడీ అవుతోంది.




## రెండు భాగాలుగా అల్లు అర్జున్ 'రాకా'.. -అట్లీ ఏం ప్లాన్ చేస్తున్నా


టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'రాకా' సినిమాకు సంబంధించి ఓ సరికొత్త వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలను రేకెత్తించిన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, 'రాకా' చిత్రాన్ని మేకర్స్ సింగిల్ పార్ట్‌గా కాకుండా రెండు భారీ భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ రెండు భాగాలను కలిపి ఏకంగా రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం.ఈ రెండు భాగాలలోనూ ఇద్దరు స్టార్ హీరోయిన్లు అలరించనున్నారు. ఒక భాగంలో అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణ్ నటిస్తుండగా, మరో భాగంలో టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక కథాంశం విషయానికొస్తే, అట్లీ ఈ చిత్రాన్ని అత్యంత వైవిధ్యంగా ప్లాన్ చేశారు. ఒక పార్ట్‌ను పూర్తిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిస్తుండగా, మరో పార్ట్‌ను పూర్తిగా భిన్నమైన ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలో నడిచేలా రూపొందిస్తున్నారట. ఇందులో హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే భాగంలో దీపికా పదుకొణ్ నటిస్తుందని తెలుస్తోంది. వీటితో పాటు ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే అట్లీ దర్శకత్వంలో షారుఖ్ నటించిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ చిత్రంలోనూ ఆయన నటిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు.




## అమ్మ నన్ను వాట్సాప్‌లో బ్లాక్ చేసింది..

– స్టార్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ఎమోషనల్ కామెంట్స్ వైరల్

టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న యువ కథానాయిక భాగ్యశ్రీ బోర్సే తన సినీ ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలను తాజాగా అభిమానులతో పంచుకున్నారు. అఖిల్ అక్కినేని సరసన నటించిన 'లెనిన్' సినిమా బ్లాక్‌బస్టర్ విజయంతో టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్‌గా మారిన ఈ పూణే భామ, ఇటీవల ఓ కాలేజీలో నిర్వహించిన ఇంటరాక్టివ్ టాక్ షోలో పాల్గొని తన వ్యక్తిగత జీవితం, సినీ కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. చిన్నప్పటి నుంచే నటనపై తనకు అమితమైన ఆసక్తి ఉండేదని భాగ్యశ్రీ తెలిపారు. అయితే సినిమాల్లోకి రావాలన్న తన నిర్ణయాన్ని కుటుంబ సభ్యులు మొదట అస్సలు అంగీకరించలేదని చెప్పారు.జీవితంలో మనం తీసుకునే నిర్ణయాలకు చివరికి మనమే బాధ్యత వహించాలి. ఇతరుల కోసం మన కలలను వదులుకుంటే తర్వాత పశ్చాత్తాపపడాల్సి వస్తుంది. అందుకే నటిగా మారాలనుకుంటున్నానని ముందుగా అమ్మకు చెప్పాను. కానీ ఆమె వెంటనే 'వద్దు' అని చెప్పింది. తర్వాత నాన్నతో మాట్లాడితే, 'అమ్మ వద్దన్న పని నువ్వెలా చేస్తావు?' అని అడిగారు. కనీసం అక్క అయినా నాకు మద్దతు ఇస్తుందనుకున్నా, ఆమె కూడా అమ్మానాన్నల మాటే వినాలని చెప్పింది. ఇంట్లో అందరూ నా నిర్ణయాన్ని వ్యతిరేకించారు" అని ఆమె గుర్తు చేసుకున్నారు.కుటుంబం నుంచి వ్యతిరేకత ఎదురైనా తన కలను వదులుకోలేదని భాగ్యశ్రీ చెప్పారు. నేను ఆడిషన్స్‌కు వెళ్లడం మొదలుపెట్టిన తర్వాత ఇంట్లో పరిస్థితి మరింత కఠినంగా మారింది. నా నిర్ణయం నచ్చక అమ్మ దాదాపు ఆరు నెలల పాటు నాతో మాట్లాడలేదు. అంతేకాదు, వాట్సాప్‌లో కూడా నన్ను బ్లాక్ చేసింది. ఇప్పుడు ఆ విషయాలను నవ్వుకుంటూ చెప్పగలుగుతున్నా... ఆ రోజుల్లో మాత్రం చాలా బాధపడ్డాను. అయితే తల్లిదండ్రులకు సినిమా పరిశ్రమపై కొన్ని భయాలు ఉండటం సహజం. అందుకే వారు అలా స్పందించారు అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కుటుంబ సభ్యుల అభ్యంతరాలను అధిగమించి సినీ రంగంలో అడుగుపెట్టిన భాగ్యశ్రీ బోర్సే, రవితేజ హీరోగా నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. తొలి చిత్రంతోనే తన అందం, అభినయంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి.ఆ తర్వాత విజయ్ దేవరకొండ సరసన 'కింగ్‌డమ్', రామ్ పోతినేనితో 'ఆంధ్ర కింగ్ తాలూకా', దుల్కర్ సల్మాన్తో 'కాంత' వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో అవకాశం దక్కించుకున్నారు. అయితే అఖిల్ అక్కినేనితో చేసిన 'లెనిన్' సినిమా ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఇందులో 'భారతి' పాత్రలో ఆమె నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి.



## సన్నీడియోల్ కొడితే షారుక్‌ఖాన్ స్టార్ అయ్యారు..

–'గబ్బర్ సింగ్' విలన్ కామెంట్స్ వైరల్



బాలీవుడ్ యాక్టర్లు సన్నీడియోల్, ప్రీతి జింటా లీడ్ రోల్స్‌లో తెరకెక్కిన సినిమా 'బట్వారా 1947ః. ఆగస్టు 14న విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ సందర్భంగా 'గబ్బర్ సింగ్' విలన్ అభిమన్యు సింగ్ మాట్లాడుతూ.. సన్నీ డియోల్‌ను కొట్టిన తర్వాతే షారుఖ్ ఖాన్ స్టార్‌గా ఎదిగారంటూ కామెంట్ చేయడం టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.ఈ విషయం గురించి అభిమన్యు సింగ్ మాట్లాడుతూ.. సన్నీడియోల్ ఒక మెగాస్టార్. 'డర్' (ఋుతీతీ) సినిమా షూటింగ్ సమయంలో సన్నీడియోల్ షారుక్‌ఖాన్‌ను కొట్టారు. ఈ విషయం ప్రతీ యాక్టర్‌కు తెలుసు. కానీ షారుక్‌ఖాన్ అభిమానులు, కొందరు పాకిస్థానీ జిహాదీ ముస్లింలు దీన్ని నమ్మరు. ఏదేమైనా సన్నీడియోల్ షారుక్ ఖాన్‌ను కొట్టడం వల్లే డర్ సినిమాకు మంచి పబ్లిసిటీ అయి బ్లాక్ బస్టర్ అయిందనేది నిజమని అన్నాడు. ఆ దెబ్బ కారణంగా షారుక్ ఖాన్‌కు సానుభూతి లభించింది. ఆ తర్వాత షారుక్ ఖాన్ స్టార్‌గా ఎదిగారని చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.తెలుగులో పవన్‌కల్యాణ్ హీరోగా నటించిన గబ్బర్ సింగ్ సినిమాలో విలన్‌గా సూపర్ యాక్టింగ్‌తో మంచి క్రేజ్ సంపాదించుకున్నాడు అభిమన్యు సింగ్. రక్త చరిత్ర ఫ్రాంచైజీ, బెజవాడ, దేవర ఫ్రాంచైజీ, ఓజీలో కూడా నటించాడు.

## ఓటీటీలోకి తమిళ్ బ్లాక్ బస్టర్ 'గట్టా కుస్తీ 2'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే.!



తమిళ టాలెంటెడ్ నటుడు విష్ణు విశాల్, కథానాయిక ఐశ్వర్య లక్ష్మి జంటగా నటించిన స్పోర్ట్స్ కామెడీ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'గట్టా కుస్తీ 2ః(మట్టి కుస్తీ) డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి థియేటర్లలో మంచి స్పందనతో బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శించబడిన ఈ చిత్రం, ఇప్పుడు ఓటీటీ ద్వారా ప్రేక్షకులను అలరించడానికి వస్తోంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ హక్కులను దక్కించుకుంది. ఈ క్రమంలోనే సినిమాను జూలై 31 నుంచి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తున్నట్లు అధికారిక ప్రకటించింది.ఈ చిత్రాన్ని కేవలం తమిళ భాషకే పరిమితం చేయకుండా, తెలుగు, కన్నడ, మలయాళ మరియు హిందీ భాషల్లో ఒకేసారి స్ట్రీమింగ్ చేయనున్నారు. దర్శకుడు చెల్లా అయ్యావు దర్శకత్వం వహించిన ఈ సీక్వెల్‌లో సీనియర్ నటి రమ్యకృష్ణ, ప్రముఖ హాస్య నటుడు యోగి బాబు, కరుణాకరన్ తదితరులు కీలక పాత్రల్లో నటించి మెప్పించారు. మొదటి భాగం మాదిరిగానే ఈ రెండో భాగం కూడా థియేటర్లలో మంచి వినోదాన్ని మరియు కుటుంబ భావోద్వేగాలను పంచింది.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465